

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రధాని నెహ్రూ

జ్ఞాపకాల మదిలో..

- 1953 అక్టోబరు 1న తొలి తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం
- 1956 నవంబరు 1న హైదరాబాదు స్టేట్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా అవతరణ
- తెలంగాణ రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌గానే కొనసాగింపు
- అలనాటి రాజధాని కర్నూలులో స్మృతులు నేటికీ పదిలం



ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా ఎస్టీబీసీ కళాశాల్లో ప్రసంగిస్తున్న నాటి ప్రధాని నెహ్రూ



కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1953 అక్టోబరు 1న ఆవిర్భవించిన ఆంధ్ర రాష్ట్రం తొలి రాజధానిగా కర్నూలు నగరం చరిత్రలోనిలిచింది. నాటి ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి వంటి ప్రముఖులు కర్నూలు నుంచే పాలన సాగించారు. అలాగే ఉప ముఖ్యమంత్రులుగా నీలం సంజీవరెడ్డి (తర్వాతి కాలంలో భారత రాష్ట్రపతి అయ్యారు), ప్రధాన శాఖలకు మంత్రులుగా దామోదరం సంజీవయ్య (తర్వాత తొలి దళిత ముఖ్యమంత్రి), సర్దార్ గౌతు లచ్చన్న, పట్టాభిరామయ్య, తెన్నేటి విశ్వనాథం, తిమ్మారెడ్డి, స్పీకర్‌గా నల్లపాటి వెంకట్రామయ్య, పసల సూర్యచంద్రారావు, చీఫ్ సెక్రటరీగా ఒ. పుల్లారెడ్డి వంటి ప్రముఖులు పాలన సాగించారు. అనంతర కాలంలో 1956 నవంబరు 1న నాటి హైదరాబాదు స్టేట్‌లోని తెలంగాణా ప్రాంతాలను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయింది. కర్నూలు వాసుల త్యాగనిరతితో రాష్ట్ర రాజధాని కూడా హైదరాబాదుకు తరలిపోయింది. అయితే తొలి ఆంధ్ర రాష్ట్ర రాజధానిలో ఆనాటి ముఖ్యమంత్రి నివాసం, గవర్నర్ బంగ్లా, సచివాలయం, శాసన సభ తదితర భవనాలు నేటికీ ఆనాటి వైభవాన్ని చాటిచెబుతూ జ్ఞాపకాలను మనముందు ఉంచుతున్నాయి. ఆనాటి తొలి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు వెనుక జరిగిన కృషి, జాతీయ నాయకుల కర్నూలు పర్యటన, తొలి రాజధానిలో ఆనాటి ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు తదితర అంశాలను నేటితరానికి తెలియజేసేలా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



తొలి రాజధానిలో ప్రజల సంబరాలు

ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి..

రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలు 1952 డిసెంబరు 19 వరకు (నాటి ప్రధాని నెహ్రూ లోక్‌సభలో ప్రకటన చేసేవరకు) ఉమ్మడి మదరాసు రాష్ట్రంలోనే ఒక భాగంగా ఉండేవి. తెలంగాణ ప్రాంతం హైదరాబాదు రాష్ట్రం కింద ఉండేది. మద్రాసు రాష్ట్రంలో ఆధిపత్యమంతా తమిళ నేతలదే. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికంగా తెలుగువాళ్లకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లు. దీంతో తెలుగు ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రేగి, తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఆకాంక్ష పెరిగింది. స్వాతంత్ర్యానికి పూర్వమే 1913లో గుంటూరు జిల్లా బాపట్లలో ప్రథమ ఆంధ్ర మహాసభ జరిగింది. అప్పటి నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం సభలు, సమావేశాలు ఏర్పాటు చేయసాగారు. కర్నూలు నుంచీ కూడా ప్రత్యేక రాష్ట్రం కోసం తీర్మానాలు చేసి పంపించారు. రాయలసీమ, ఆంధ్ర ప్రాంత ప్రజలు 1938లో శ్రీబాగ్ ఒప్పందంతో పరస్పర అనుమానాలు వదులుకొని కలసి పోరాడారు.



నాటి ఎమ్మెల్యేల నివాస గృహాలు - టౌన్ మోడల్ హైస్కూల్

మిగతా 6వ పేజీలో

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

- జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో పటేల్ చిత్రపటానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, జేసీ నూరుల్ ఖమర్, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులతో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. 'మై భారత్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సర్దార్ 150 యూనిటీ మార్చ్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ పాలన దక్షత, నీతి నిజాయితీ, ధృడసంకల్పం,వాస్తవ దృక్పథం, భవిష్యత్తు పట్ల దూరదృష్టి గల వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, మై భారత్ సెంటర్ జిల్లా యువజన అధికారి రాహుల్ రెడ్డి, సీపీవో భారతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

7న జడ్పీ సర్వసభ్య సమావేశం

- సీఈవో జి. నాసరరెడ్డి



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం నవంబరు 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం-అనుబంధ శాఖలు, జిల్లా నీటియాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవదాయ శాఖలపై చర్చ ఉంటుందని ఆయన వివరించారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సీసీఐ మాయాజాలం

- పత్తి అమ్మాలంటే ఎన్ని కష్టాలో..
- 4 కేంద్రాల్లోనే కొనుగోలు
- ఉమ్మడి జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- తేమ సాకుతో మద్దతు ధరకు దూరం చేస్తున్న అధికారులు



పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి



ఈ రైతు పేరు సుభాన్. గూడూరు మండలం మల్లాపురం. ఈ రైతు నాలుగెకరాల్లో ఖరీఫ్‌లో పత్తి పంటను సాగు చేశాడు. ఎకరాకు రూ. 50వేలకు పైగా ఖర్చు చేశాడు. 40 క్వింటాళ్ల పత్తిని అక్టోబరు 30న పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. అక్కడున్న అధికారులు నవంబరు 4న రావాలని తిప్పి పంపారు. సీసీఐ అమలు చేస్తున్న కపాస్ కిసాన్ యాప్‌లో పత్తిని అమ్మేందుకు వివరాలు నమోదు చేసుకుంటే 30వ తేదీన రావాలని మెసేజ్ వచ్చిందని, తీరా ఇక్కడికి వస్తే తిప్పి పంపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఎంతో ఖర్చు పెట్టుకొని పత్తి విక్రయించడానికి వచ్చానని ఆయన అన్నాడు.

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా లేవు. సీసీఐ కొత్త నిబంధనల మాయాజాలంలో పత్తి రైతులు మద్దతు ధరకు దూరం అవుతున్నారు. పత్తి విక్రయించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 5.50లక్షల ఎకరాల్లో పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేశారు. నంద్యాల జిల్లాలో 12వేల ఎకరాల్లో మాత్రమే పత్తి పంట సాగైంది. సీసీఐ అధికారులు సవాలక్ష అడ్డంకులు పెడుతూ అక్టోబరు 30న గూడూరు మండలంలోని పెంచికలపాడు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోనిలోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మొదటి రోజే వందలాది మంది రైతులు వేయి క్వింటాళ్లకు పైగా పత్తిని అమ్మకానికి తీసుకవచ్చారు. కొనుగోలు చేసింది మాత్రం 17 మంది రైతుల నుంచి 273 క్వింటాళ్లు మాత్రమే. ఇంకోపక్క విధిలేక వ్యాపారులకు వేలాది మంది రైతులు ఇప్పటికే లక్ష క్వింటాళ్ల దాకా పత్తిని క్వింటం రూ.6వేల నుంచి రూ.6,500కే అమ్ముకున్నారు. ఈ సంవత్సరం 33 లక్షల క్వింటాళ్లకు పైగానే రైతుల చేతికందింది. సీసీఐ అధికారుల నిర్లక్ష్యాన్ని చూస్తే ఈ మొత్తం పత్తిని రైతుల నుంచి కొనేలా కనిపించడం లేదు. 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు చెప్పినా.. ఆచరణలో 30వ తేదీన కేవలం 4 కేంద్రాలను మాత్రమే ఏర్పాట్లు చేశారు.



సీసీఐ కేంద్రానికి వచ్చిన రైతులు

రైతుల మెడపై వేలాడుతున్న తేమ కత్తి

పత్తిని మార్కెట్‌లో విక్రయించే సమయంలో తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో పొడి తగ్గిపోయింది. కనీసం పత్తిని ఆరబెట్టలేని పరిస్థితి. మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు క్వింటానికి రూ.6వేల నుంచి రూ.6,500కు మాత్రమే కొంటామని, లేకపోతే వెనక్కు తీసుకెళ్లాలని మొఖం మీదనే చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటానికి రూ.8,110 ఇస్తామని చెప్పడమేగాని, ఆ ధర ఇవ్వడం లేదని, తేమ శాతం 12కి మించితే ఒక క్వింటం కూడా కొనేది లేదని సీసీఐ అధికారులు అంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. 8 శాతం తేమ ఉంటేనే క్వింటానికి రూ.8,110 చెల్లిస్తామని, ఆ తర్వాత 8 నుంచి 12 శాతం మధ్య ఉంటే ధరను తగ్గిస్తామని అంటున్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఒక పెద్ద అబద్ధమని రైతులు అంటున్నారు. తేమ శాతం ఒక శాతం పెరిగితే క్వింటానికి రూ.81లు కోత విధిస్తామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. 12 శాతం మించి పత్తిలో తేమ ఉంటే.. ఒక్క క్వింటం కూడా కొనమని అధికారులు స్పష్టం చేశారు.

మిగతా 6వ పేజీలో



పనుల జాప్యంపై ఆగ్రహం

- కాంట్రాక్టర్‌ను నిలదీసిన కలెక్టర్
- జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కొనసాగుతున్న యురాలజీ, న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్ పనుల జాప్యంపై ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్‌పై కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కర్నూలు జీజీహెచ్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ఓపీ కేంద్రాలతో పాటు వార్డుల్లో కలియ తిరిగారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడే సమయంలో వైద్యులు సిబ్బందిని దగ్గరకు రానీయకుండా కలెక్టరే వారి దగ్గరకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు వస్తున్నారా? బాగా చూస్తున్నారా.. ఏ ఆరోగ్య సమస్యతో వచ్చారు.. అంటూ ప్రశ్నలు వేశారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని న్యూరోసర్జరీ, కార్డియాలజీ విభాగాలను పరిశీలించారు. యురాలజీ, న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్ పనులను పరిశీలించి ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఎన్ని రోజులు పనులు చేస్తారంటూ మండిపడ్డారు. బూత్ బంగ్లాలోని వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఇన్ని వార్డులకు నాలుగు బాత్‌రూమ్‌లా ఇందులో మహిళలు ఎలా వెళ్తారు.. తలుపులు లేకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రంలోపు బాత్‌రూమ్‌లకు తలుపులు ఏర్పాటు చేయాలని ఇంజనీర్ చిరంజీవులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజనీర్ అధికారులు సాయంత్రం తలుపులు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్, ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో వెంకటరమన, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ ఏడీ మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.



ఈఎన్‌టీ ఓపీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఏ.సిరి

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం: ఎస్పీ

కర్నూలు క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతల పరిరక్షణే పోలీసు వ్యవస్థ లక్ష్యమని, ఈ మేరకు అందరూ గట్టిగా పని చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. ఈ సంవత్సరంలో ఇక రెండు నెలలే మిగిలి ఉందని, క్రైమ్ రేట్ బాగా తగ్గించాలన్నారు. ప్రాపర్టీ రికవరీలు పెంచాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో చిన్న గొడవలు కూడా జరగకుండా కౌన్సిలింగ్ చేయాలన్నారు. అవసరమైతే పీడీ యాక్టులు నమోదు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సీసీటీఎన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం ప్రధాని పర్యటన ఏర్పాట్లలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, భార్గవి, సీఐలు, ఎస్ఐలు, ఈగల్ టీమ్ ఎస్ఐ సుజన్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి

కర్నూలు లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు బుగ్గిపాలవుతాయని, వాటికి దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి పిలుపునిచ్చారు. ట్రాఫిక్ రూల్స్, డ్రంకెన్ డ్రైవ్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం జరిగిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబర్ధి మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని కోరారు. మద్యం, మాదక ద్రవ్యాలు సేవించి ప్రమాదాలకు గురైతే.. వారి జీవితాలతో పాటు మొత్తం కుటుంబాలు నష్టపోతాయని ఆయన తెలిపారు. జిల్లా కోర్టు నుంచి కొండారెడ్డి బురుజు వరకు జరిగిన ర్యాలీలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, అదనపు జిల్లా న్యాయాధికారులు పి.కమలాదేవి, వి.లక్ష్మీరాజ్యం, ఎం.శోభారాణి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, న్యాయాధికారులు సరోజినమ్మ అనూష, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ భరత్ చవాన్, ఆర్టీసీ డీఎం సుధారాణి, డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, సీఐ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి, న్యాయాధికారులు, న్యాయవాదులు



కేఎంసీ ప్రతిష్టను పెంచండి

- రిటైర్డు ప్రిన్సిపాల్ పి.సుధాకర్
- పంచెకట్టు, చీరల్లో వైద్య విద్యార్థులు
- ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే

7

జగన్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో గడప దాటని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం శవ రాజకీయాలు చేసే జగన్ తుఫాన్‌ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు కనిపించలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం రాత్రి, పగలు సహాయక కార్యక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఏదో ఒకటి బురదజల్లే కార్యక్రమాలను చేపట్టి విషయాన్ని పక్కదారి పట్టించే విధంగా విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. ఇకనైనా చంద్రబాబు గురించి చౌకబారు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

● రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

● జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా, సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ

ఆళ్లగడ్డ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిస కావొద్దని జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై న్యాయ శాఖ, పోలీసు అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కోర్టు ఆవరణ నుంచి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ, డీఎస్పీ ప్రమోద్, జేఎఫ్‌సీ భాస్కర్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, టౌన్ సీఐ యుగంధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, సీనియర్ న్యాయవాదులు సూర్యనారాయణ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రమాదేవి, నీలకంఠేశ్వరరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

● కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బాధితులతో కలెక్టర్, ఎస్పీ సునీల్ షెరాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలిస్తామని సుమారు 850 మంది బాధితుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.3.6లక్షలు హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సంస్థ వసూలు చేసిందన్నారు. బాధితులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తే త్వరగా న్యాయం చేస్తామన్నారు. ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుల సహకారంతో విచారణ మరింత వేగవంతం అవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పాల్గొన్నారు.

విశ్వశాంతి యాగం ప్రారంభం

● పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి దంపతులు



ఆశీర్వాదం అందజేస్తున్న స్వరూపానంద స్వామిజీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శుక్రవారం శ్రీకృష్ణమఠం పీఠాదిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ప్రారంభమైంది. తొలిరోజు ప్రారంభ పూజల్లో స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దంపతులు పాల్గొన్నారు. యాగశాలలో గణపతి పూజ, శుద్ది పుణ్య హావాచనం, పంచగవ్య ప్రాశాన, రుత్విక్ వరుణ, గోసహిత యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి స్థాపన, వంటి పూజలను స్వామి ఆధ్వర్యంలో నిర్వహించి మహాయాగానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా అతి రుద్రహోమ పూజలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. స్వామిజీ ఎమ్మెల్యే దంపతులకు ఫలపుష్ప మంత్రాక్షితలిచ్చి ఆశీస్సులు అందజేశారు. టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, మహేంద్ర బాబు, మాచాని మహేష్, మాచాని శివశంకర్, రంగస్వామిగౌడ్, వెంకటేశప్ప రాజు, వాల్మీకి రాజు, నరసప్ప, గిరి, డీలర్ ఈరన్న, కొండన్న గౌడ్, ఎన్వీ రామాంజనేయులు పాల్గొన్నారు.

జ్ఞాపకాల మదిలో..

5వ పేజీ తరువాయి

కానీ జాతీయోద్యమం ఉధృతంగా ముందుకు రావడంతో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కొంతకాలం కనుమరుగైంది.

స్వాతంత్ర్యానంతరం తిరిగి తెరపైకి...

స్వాతంత్ర్యం లభించాక ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం డిమాండ్ మొదలైంది. 1948 జూన్ 17న రాజ్యాంగ సభ ఒక కమిటీని నియమించింది. దీనికి ఎస్‌కే మంజుదార్ అధ్యక్షుడిగా ఉండగా, డాక్టర్ పన్నాలాల్, జగత్ నారాయణ్‌లాల్ సభ్యులు. వీరి పరిపాలన సౌలభ్యం ప్రాతిపదికనే రాష్ట్రాల విభజన జరగాలని, భాషా ప్రయుక్త రాష్ట్రాల వలన దేశ సమైక్యతకు భంగం కలుగుతుందని చెప్పారు. దీనిపై అనేక భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. కేంద్రం మరో కమిటీని వేసింది. అందులో నాటి ప్రధాని నెహ్రూ, పటేల్, పట్టాభి సభ్యులు. దీన్ని జేవీపీ కమిటీ అంటారు. వీరు 1952లో ఒక నివేదిక ఇస్తూ ఆంధ్రులు మద్రాసు రాష్ట్రం వదులుకుంటూ ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందని చెప్పారు. అందుకు చాలామంది నేతలు ఒప్పుకోలేదు. దాంతో సమస్య తెగలేదు.

పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షతో...

ఈ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 1952లో నిరవధిక నిరాహార దీక్షకు దిగి 53రోజుల తర్వాత అమరుడయ్యారు. ఆయన ప్రాణత్యాగంతో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతం భగ్గుమంది. ప్రభుత్వ కార్యాలయాలు తగలబడ్డాయి. బస్సులు, రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో అప్పటి ప్రధాని నెహ్రూ 1952 డిసెంబరు 19న లోక్‌సభలో ప్రకటన చేశారు. బళ్లారి, మద్రాసు ప్రాంతాలను మినహాయించి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించారు.

గుడారాల రాజధాని : ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక పరిపాలన సజావుగా సాగడానికి దాదాపు 4 వేల మంది అధికారులను ప్రభుత్వం నియమించుకుంది. కానీ అప్పటికి నగరం పూర్తిగా అభివృద్ధి కాలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ సహాయంతో మిలటరీ వారు వాడే గుడారాలను తెప్పించి, వాటిని కార్యాలయాలుగా మార్చివేశారు. అవి ఎ.క్యాంపు, బి.క్యాంపు, సి.క్యాంపులుగా ఉండేవి. తర్వాత వాటి స్థానంలో భవనాలు నిర్మించారు. అవే ఇప్పుడు నగర నడిబొడ్డున ఏ,బీ,సీ క్యాంపులు. అలా తొలి రాజధానిని టెంటెడ్ క్యాపిటల్ అని పిలిచేవారు.



నాటి శాసన సభలో ప్రసంగిస్తున్న నెహ్రూ

కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఆవిర్భావం

స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు సూచనల మేరకు ప్రధాని నెహ్రూ కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేశారు. అలా 1953 అక్టోబరు 1న ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా, కర్నూలు రాజధానిగా 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్ర అవతరణ కార్యక్రమం నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఘనంగా జరిగింది. ప్రధాని నెహ్రూతో పాటూ నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విచ్చేశారు.



నాటి సచివాలయం - నేటి వైద్యకళాశాలలోని భవనం

తొలి రాజధానిలోని వివిధ కార్యాలయాలు

- శాసన సభ: ప్రస్తుతం కొత్తపేట సమీపంలోని జిల్లా కోర్టు ఆనాటి శాసనసభ. మూడేళ్ల నాటి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, సందర్శకులతో ఈ ప్రదేశం కళకళలాడేది.
- సచివాలయం : రాష్ట్ర పరిపాలన వ్యవహారాలు చూసే సచివాలయం ప్రస్తుతం పెద్దాసుపత్రిలో ఉంది. ఇది వైద్య విద్య అభ్యసించే విదార్థుల భవనంగా ఉంది.
- గవర్నర్ నివాసం : నాటి తొలి గవర్నర్ సీఎం త్రివేది నివాసంగా మార్చుకున్న గవర్నర్ బంగళా నేడు కేవీఆర్ మహిళా కళాశాలగా సేవలందిస్తోంది.
- శాసన సభ్యుల నివాసాలు : టౌన్ మోడల్ హైస్కూల్‌లోని గదులే నాటి శాసన సభ్యుల నివాస గృహాలు
- ముఖ్యమంత్రి నివాసం : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఎస్టీబీసీ కళాశాల పక్కనున్న ఒకనాటి ఎస్పీ నివాసం సీఎం కార్యాలయంగా పనిచేసేది.
- ప్రస్తుత కలెక్టర్ బంగ్లా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి నివాస గృహంగా ఉండేది.
- ఎక్సైజ్ కార్యాలయం నాటి ఏపీపీఎస్సీ కార్యాలయంగా ఉండేది.



నాటి శాసన సభ - నేటి జిల్లా కోర్టు భవనం

సీసీఐ మాయాజాలం

5వ పేజీ తరువాయి

కపాస్ కిసాన్ యాప్‌తో తలపోటు

కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఎప్పుడు కొనుగోలుకు రావాల్సింది స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రకారం చేశాక, మెసేజ్‌లో సూచించిన తేదీన రైతులు పత్తిని విక్రయానికి తీసికెళ్లితే ఆ తేదీలు రద్దు చేశామని కొత్త తేదీలు సూచిస్తున్నారు. మరి కొందరు రైతులకు అసలు సెల్ ఫోన్‌కు వివరాలే అందడం లేదు. పత్తి కొనుగూడదనే ఉద్దేశంతోనే సీసీఐ అధికారులు ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని రైతు సంఘాల ప్రతినిధులు ధ్వజమెత్తుతున్నారు.



నిబంధనలు పాటిస్తేనే మద్దతు ధర..

పత్తి రైతులు సీసీఐ విధించిన నిబంధనలను పాటించాల్సిందే. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ద్వారా తాము పండించిన పత్తి వివరాలను ఈక్రాప్ విధానంలో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఏ తేదీల్లో అమ్మకానికి పత్తిని తీసుకెళ్లాలో సీసీఐ అధికారుల నుంచి సమాచారం తీసుకోవాలి. రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి కొనుగోలు కేంద్రాలను పెంచుతాం.

● నారాయణమూర్తి, ఏడీఎం

ఇన్ని అడ్డంకులు ఉన్నాయని తెలిస్తే.. మా ఊళ్లోనే అమ్ముకునేవాడిని



నా సొంత పొలం ఐదెకరాలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. సీసీఐ అధికారులు క్వింటానికి రూ.8,110 అందిస్తామనడంతో పెంచికలపాడు కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకెళ్లాను. మళ్లీ రమ్మని తిప్పి పంపారు. ఇన్ని అడ్డంకులు ఉంటాయని తెలిస్తే, ఇంత ఖర్చు పెట్టుకోకుండా మా ఊళ్లోనే అమ్మేసుకొనే వాడిని.

● లాలెప్ప, రైతు, గుడిపాడు



సీఐ రామును వరించిన అరుదైన గౌరవం

● పురస్కారానికి ఎంపిక



వరదల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఐ రాము(ఫైల్)

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అర్బన్ సీఐ రాముకు అరుదైన గౌరవం లభించనుంది. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆత్మకూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో పోలీసుశాఖ ద్వారా ప్రజలకు ఆయన సేవలందించారు. దీన్ని గుర్తిస్తూ సీఎం చంద్రబాబు చేతులమీదుగా గౌరవ పురస్కారాన్ని అందజేసేందుకు ప్రభుత్వం ఆయన పేరును ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం అమరావతిలోని ఉండవల్లిలో గల సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగే అవార్డుల ప్రదానానికి హాజరు కావాలని సీఎంవో నుంచి శుక్రవారం సాయంత్రం సీఐకు పిలుపు వచ్చింది. తుఫాన్ నేపథ్యంలో ఆయా వాగుల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా సీఐ రాము విధుల్లో అంకితభావాన్ని ప్రదర్శిస్తూ నిరంతరం పనిచేశారు. వరదల్లో చిక్కుకున్న గ్రామాలకు సైతం వెళ్లి అక్కడి ప్రజల బాగోగుల గురించి తెలుసుకున్నారు. వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటివిడుదల జరిగినప్పటికీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చాలా ఆనందంగా ఉంది



తుఫాన్ సమయంలో తన సేవలను గుర్తిస్తూ సీఎంవో వారు తనను అవార్డుకు ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈఅవార్డు నాలో మరింత బాధ్యత పెంపొందిస్తుందని ఆశిస్తున్నా.

● రాము, అర్బన్ సీఐ, ఆత్మకూరు

నేటి నుంచి కర్నూలు ఉత్సవ్-2025

● కలెక్టరేట్ నుంచి వెయ్యి మందితో ర్యాలీ

● హాజరుకానున్న ప్రముఖులు



కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేలా, ఏడు రోజుల పాటూ రోజూ 12 గంటల పాటు నిర్విరామ ప్రదర్శనలకు టీజీవీ కళాక్షేత్రం వేదిక అవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటూ 'కర్నూలు ఉత్సవ్-2025' పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు నగరంలోని తెలుగుతల్లి, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పుష్పాలను అర్పిస్తారు. అనంతరం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు వెయ్యి మంది కళాకారులు, రచయితలు, కవులు, గాయకులు, యువతతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ క్వామర్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభిస్తారు. ఈ ర్యాలీలో రవీంద్ర, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేతలు జి. పుల్లయ్య, కేఎన్‌వీ రాజశేఖర్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు. వారం రోజుల పాటూ నిత్యం 12 గంటల పాటు కొనసాగే ఈ వినూత్న కార్యక్రమాలను నమోదు చేసేందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు హాజరవుతున్నారు. గతంలో రెండుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించిన టీజీవీ కళాక్షేత్రానికి మూడోసారి అవకాశం లభించబోతోంది.

● నేటి కార్యక్రమాలు : ఉదయం 11 గంటలకు రవీంద్ర విద్యాసంస్థల విద్యార్థులతో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం 6గంటల వరకు ఏకాంకిక పౌరాణిక నాటక ప్రదర్శనలు కొనసాగుతాయి. సాయంత్రం 6.30 గంటలకు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, కోలాటం ప్రదర్శనలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన న్యూరో సర్జన్ డాక్టర్ డబ్ల్యూ సీతారాం, తెలంగాణ విశ్రాంత డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, డీఈఓ శామ్యూల్ పాల్, సేవా రంగంలో బీసీ రాజారెడ్డి (బనగానపల్లె), విద్యా రంగంలో రామకృష్ణారెడ్డి (నంద్యాల), అరుణాచలం రెడ్డి (కర్నూలు), కేసీ కల్కూర (పూర్వ గ్రంథాలయ సంస్థ చైర్మన్), గండ్లూరి దత్తాత్రేయ శర్మ (అవధానం, డోన్), రజనీబాయి (రంగస్థల నటి, కర్నూలు)లను సత్కరిస్తారు.

ఉమ్మడి జిల్లా ఖ్యాతిని తెలియజేసేలా : పత్తి ఓబులయ్య



ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేలా 'కర్నూలు ఉత్సవ్-2025' వేడుకను నిర్వహిస్తున్నాము. ఈ వేడుక ఉమ్మడి జిల్లా ప్రజలందరి వేడుక. తుంగభద్ర, హంద్రీ, కృష్ణా, కుందూ వంటి జీవ నదులు ఉమ్మడి జిల్లాలో ప్రవహిస్తూ వేనేళ్ల సంస్కృతిని అందిస్తున్నాయి. శ్రీశైలం, అహోబిళం, మహానంది, యాగంటి, మంత్రాలయం వంటి పుణ్యక్షేత్రాలు ఆధ్యాత్మిక, ధార్మిక వైభవాన్ని చాటి చెబుతున్నాయి. ఇక తొలి స్వాతంత్ర్య సమరయోధుల నుంచీ జిల్లా చరిత్రను దేశ చిత్ర పటంలో నిలిపిన రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు అందించిన ఘనత ఈ ప్రాంతానిది. ఎందరో మహనీయులు నడయాడిన ఈనేల చారిత్రక, సాంస్కృతిక, కళారంగ విశేషాలను భావితరాలకు అందించాలన్న ఏకైక లక్ష్యంతోనే ఈ వేడుకలను నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నాం.

కృష్ణమ్మకు జలహారతి



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పరవళ్లు తొక్కుతూ ఉప్పొంగుతున్న కృష్ణమ్మను శాంతించమంటూ నదీమతల్లి విగ్రహా నికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై దశ విధాలుగా జల హారతు లను సమర్పించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊయలసేవ నిర్వహించారు.

కొవ్వొత్తులతో ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రసూన న్యాయ విద్యార్థులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 24న జరిగిన బస్సు ఘోర రోడ్డు ప్రమాదంలో మృతులకు ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులతో శుక్రవారం రాత్రి ఘన నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదాలకు చేరకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహేష్, మాలిక్, సీనియర్ న్యాయవాదులు ఖాద్రి, మోహన్ కృష్ణ, బంగి సుధీర్ పాల్గొన్నారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డాకు సీఎం చంద్రబాబు అభినందన

ఆత్మకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని సీఎం చంద్రబాబు శుక్రవారం అభినందించారు. మొంథా తుఫాన్ విపత్తు నేపథ్యంలో శ్రీశైల నియోజకవర్గం పరిధిలో ఎటువంటి అప్రశృతి చోటు చేసుకోకుండా అధికార యంత్రాంగాన్ని, పార్టీల శ్రేణులను ఎమ్మెల్యే బుడ్డా అప్రమత్తం చేశారు. వరదలతో నిరాశ్రయులైన బాధితులకు అండగా నిలిచారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నారు. శనివారం అమరావతిలోని ఉండవల్లిలో జరిగే సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే బుడ్డా హాజరుకావాలని ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేను అభినందించడంపై స్థానిక కూటమి పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

ఉబికిన గంగమ్మ



మూడు రాళ్లపల్లె పాఠశాల వద్ద బోరు నుంచి ఉప్పొంగుతున్న నీరు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలాలు పెరిగిపోయాయి. చాగలమర్రి మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్దగల బోరు మోటార్ వేయకుండానే గంగమ్మ ఉబికి వస్తోంది. శుక్రవారం బోరు నుంచి నీరు ఎగిసి పడుతోంది. విద్యార్థుల కోసం గతంలో వేసిన బోరు నుంచి నీరు ఉబికి వస్తుండటంతో గ్రామస్థులు ఆశ్చర్యపోతున్నారు. రుద్రవరం మండలంలో సైతం వ్యవసాయ బోరుబావులు పొంగి పొర్లుతున్నాయి. బోరులో నుంచి నీరు ఎగిసి పడుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● చాగలమర్రి/ రుద్రవరం, ఆంధ్రజ్యోతి



రుద్రవరం మండలం డి.కొట్టాల సమీపంలో పొంగుతున్న బోరుబావి





దేశభక్తి గీతానికి మెడికల్ కళాశాల విద్యార్థుల నృత్యం



ఫ్రెషర్స్‌డే వేడుకలో ప్రసంగిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్



కేఎంసీ ప్రతిష్టను పెంచండి

రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

పంచెకట్టు, చీరల్లో మెరిసిన వైద్య విద్యార్థులు

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బెస్ట్ కాలేజీగా పేరొందిన కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ) ప్రతిష్టను మరింత పెంచాలని రిటైర్డు ప్రిన్సిపాల్ డా.పి.సుధాకర్ వైద్యవిద్యార్థులకు పిలుపునిచ్చారు. 2025 బ్యాచ్ వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు కేఎంసీ న్యూఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఫ్రెషర్స్‌డేను 2023 బ్యాచ్ ఎంబీబీఎస్ సీనియర్ విద్యార్థులు విహాన్-2025 పేరుతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.సుధాకర్ మాట్లాడుతూ పేద రోగులే గొప్ప వైద్య బోధకులని, రోగుల బాధలను, ఇబ్బందులను సమస్యలను ఓపికగా వినాలన్నారు. తాను కర్నూలు మెడికల్ కాలేజీలో 45ఏళ్లు వైద్యుడిగా పనిచేశానని తెలిపారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టి నరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ఐహాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ఎం.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

అలరించిన పంచెకట్టు

ఫ్రెషర్స్‌డే సందర్భంగా వైద్య విద్యార్థులు పంచెకట్టు అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థినులు చీరల్లో కనిపించారు. జూనియర్ వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా కేరింతలతో కొనసాగాయి.





వైద్య విద్యార్థుల స్నేహబంధం





పంచెకట్టులో భావి డాక్టర్లు

బస్సు ప్రమాద బాధితుడికి కలెక్టర్ పరామర్శ



ఆర్ఐసీయూలో గుణసాయితో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చిన్నటేకూరు వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్ర అస్వస్థలకు కెమికల్ లంగ్ ఇన్‌ఫెక్షన్‌కు గురైన కోనసీమ జిల్లా కాటలేనికొనకు చెందిన గుణసాయి కోలుకుంటున్నారు. బస్సులో అగ్నికీలాల నుంచి తప్పించుకుని తీవ్ర అనారోగ్యానికి గురై గత నెల 25వ తేదీన కర్నూలు జీజీహెచ్‌లో చేరారు. బస్సులోని మంటల నుంచి పొగను పీల్చడంతో ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్‌తో పాటు అన్నవాహకలోని ఫుడ్ పైప్ దెబ్బతిన్నట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు తెలిపారు. కెమికల్ లంగ్ ఇన్‌ఫెక్షన్‌కు గురి కావడంతో రోగిని ఆర్ఐసీయూలో ఉంచి ముగ్గురు వైద్యులు పర్యవేక్షణలో ఏడు రోజులుగా చికిత్స అందిస్తున్నామన్నారు. పొగ వల్ల ఫుడ్ పైపు కూడా దెబ్బతినగా ఎండోస్కోపి చేసి చికిత్స అందిస్తున్నామన్నారు. నాలుగు రోజుల తర్వాత జనరల్ వార్డుకు షిఫ్ట్ చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ చికిత్స తీసుకుంటున్న గుణసాయిని పరామర్శించారు. అలాగే కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు కూడా ఉదయం రోగిని పరామర్శించారు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత స్టేట్ గెస్టు హౌస్‌లో ఉంచి స్వస్థలానికి పంపిస్తామని చెప్పినట్లు రోగి తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

- ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



మాట్లాడుతున్న వీసీ వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న నిర్వహించనున్న 4వ స్నాతకోత్సవంకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) వీసీ వెంకట బసవరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌యూలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ కమిటీల కన్వీనర్లు, సభ్యులతో ఆయన సమీక్షించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్నాతకోత్సవ నిర్వహణలో ఎటువంటి లోటు పాట్లకు తావులేకుండా తగిన ప్రణాళికలను రూపొందించుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. వివిధ పీజీ కోర్సుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ, డిగ్రీ ప్రదానానికి తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచిం చారు. రాజ్‌భవన్ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ స్నాతకోత్సవ ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాల్సిందిగా ఆదేశించారు. సమావేశంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌నాయుడు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, నరసింహులు, ప్రొఫెసర్లు సుందరానందపుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరొకరికి గాయాలు

ఆళ్లగడ్డ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. కడప పట్టణానికి చెందిన రమణారెడ్డి, వినయ్ సొంత పనుల నిమిత్తం కారులో కడప నుండి కర్నూలుకు బయలుదేరారు. ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి డివైడర్‌ను అతి వేగంగా ఢీ కొన్న కారు రోడ్డు అవతలి పొలాల్లోకి దూసుకొని పోయింది. దీంతో రమణారెడ్డి(55) అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. రూరల్ ఎస్ఐ వరప్రసాద్ ప్రమాద స్థలాన్ని చేరుకొని మృత దేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వినయ్‌ని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం లభ్యం

పాములపాడు, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌కు ఉధృతంగా ప్రవహించిన వాగులో గల్లంతైన జెల్లె నాగేశ్వరరావు (47) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. కొత్తపల్లి మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన జెల్లె నాగేశ్వరరావు ఈ నెల 29న పాములపాడులో మెడిసిన్ కొనుగోలు చేసి తిరిగి ఊరికి వెళ్లడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి వాగును మోటారు సైకిల్‌పై దాటుతుండగా నీటి ప్రవాహంలో వాహనంతో సహా కొట్టుకుపోయాడు. మూడు రోజులుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. శుక్రవారం సాయంత్రం పాములపాడు గ్రామ శివార్లలోని పంటపొలాల్లో మృతదేహం లభ్యమైంది. శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పచెప్పినట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు.

ఇనుపకడ్డీల్లో ఇరుక్కొని రైతు మృతి

చాగలమర్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో ఉన్న మంగమ్మ బరకలు సమీపంలో భవనాశి వాగు నుంచి ముత్యాలపాడు చెరువుకు నీరు సరఫరా చేసే తూముకు అడ్డుకట్ట వేసే క్రమంలో ఇనుప కడ్డీలలో ఇరుక్కొని రైతు రంగయ్య (61) శుక్రవారం మృతి చెందాడు. భవనాశి వాగు నుంచి ముత్యాలపాడు చెరువుకు నీరు తరలించేందుకు తూము ఏర్పాటు చేశారు. అధిక వర్షాలతో భవనాశి ఉధృతంగా ప్రవహించడంతో తూము నుంచి భారీగా నీరు సమీప పంట పొలాల్లో ప్రవహించి నీట మునిగాయి. దీంతో ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతులు రంగయ్య, సుబ్రమణ్యం, నరసింహుడు, బడేబాయి, రామమూర్తిలతో పాటు మరి కొందరు తూమును మూసి వేసేందుకు ఇనుప కటాంజనం తీసుకెళ్లారు. దాన్ని ఏర్పాటు చేసే సమయంలో రంగయ్య ఇరుక్కపోయాడు. నీటి ప్రవాహం అధికమవడంతో కటాంజనం తీసే ప్రయత్నంలో రంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన రంగయ్యను నీటిలో నుంచి తోటి రైతులు బయటకు తీశారు. ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ముగ్గురు సంతానం. . భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వపరంగా సాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

- రైతు మృతికి సంతాపం

మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన రంగయ్య ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పాల డైరీ చైర్మన్ రమణారెడ్డి, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు
- కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాధితులు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో దొర్నిపాడు మండల కేంద్రానికి చెందిన వీరారెడ్డి, అతని అల్లుళ్లు మోసం చేశారని బాధితులు వాపోయారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో హెల్త్ అండ్ వెల్త్ కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలిస్తామని, ఒక్కొక్కరికి నెలకు రూ.40 వేల చొప్పున వేతనం ఉంటుందని సుమారు 2000 మందితో ఒక్కొక్కరి వద్ద రూ.3.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగం ఆశతో ఇంట్లోని బంగారం, ఇళ్లు, ఆస్తులు తాకట్టు పెట్టి, అప్పులు చేసి నిర్వాహకులకు డబ్బు చెల్లించామన్నారు. గత నెల నుంచి వేతనం ఇవ్వకపోగా కంపెనీ యాజమాన్యం ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నారన్నారు. ఈవిషయమై ఈ నెల 7వతేదీ నుంచి 10 వతేదీ వరకు దొర్ని పాడులో ఆందోళనలు చేపట్టినట్లు వారు తెలిపారు. దీనికి స్పందించిన పోలీసు యాజమాన్యం న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకున్నా మన్నారు. ఇంతవరకు పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కలెక్టర్, ఎస్పీ న్యాయం చేస్తారని ఇక్కడకు వచ్చామన్నారు. పోలీసు అధికారుల నిర్లక్ష్యంతోనే పుట్టగొడుగుల్లా మోసపూరిత కంపెనీలు వస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయని పక్షంలో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దళారులతో మోసపోకండి

- మార్కెట్‌యార్డు చైర్మన్ హరిబాబు
- పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



బ్రోచర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ హరిబాబు, మార్కెట్ కమిటీ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చి తమ పంటను అమ్ముకోవాలి మార్కెట్‌యార్డు చైర్మన్ హరిబాబు అన్నారు. అయ్యలూరుమెట్ట సమీపంలో మురారి పత్తి మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శక్రవారం ఆయన ప్రా రంభించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పత్తి పంటకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల జిల్లా ఉప మార్కెటింగ్ సంచాలకులు కల్పన మాట్లాడుతూ రైతులు సీసీఐ కేంద్రానికి పత్తిని తెచ్చే ముందు సీసీఐ రూపొందించిన కపాస్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 12శాతం మించి తేమశాతం ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుందన్నారు. పత్తి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్‌రహిమాన్, మార్కెట్‌యార్డు డైరక్టర్ స్వామినాయక్, సహాయకార్యదర్శి శేషిరెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలుపుదల

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కనీస మద్దతు ధరతో రైతుల నుంచి శని, ఆదివారాలు పత్తి కొనుగోళ్లు నిలిపివేసిందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు శుక్రవారం తెలిపారు. సీసీఐకి విక్రయించుకునే రైతులు తమ పత్తిని తీసుకురావద్దని సూచించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు యథావిధిగా సీసీఐ పత్తి కొనుగోళ్లు ఉంటాయన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఈ విషయాన్ని గమనించి సోమవారం రావాలని తెలిపారు. ఇంటి వద్దనే పత్తి బాగా ఆరబెట్టుకుని తేమ లేకుండా తీసుకురావాలని సూచించారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ డిప్లమా ఇన్ అలైడ్ హెల్త్ కేర్ సర్వీసెస్ కోర్సులకు మిగిలిన సీట్లకు దరఖాస్తులకు అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.వీ. చిట్టినరసమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీడీఆర్‌ఏలో బీసీ-ఏ కేటగిరికి-1, ఈసీజీలో ఓసీ పీహెచ్ కేటిగిరికి-1, డీఏఎన్ఎస్‌లో ఓసీపీహెచ్ కేటగిరికి 1 సీటు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా కేటగిరీలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కాలేజీ ఆఫీసులో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

రేపు జిల్లా ఈత ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో డీఎస్ఏ ఈత కొలనులో ఈ నెల 2వ తేదీన సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలకు ఈత ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి క్రిష్ణ యాదవ్ తెలిపారు. ఎంపికైన స్విమ్మర్లు 16న విజయవాడ, 22న విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారనీ తెలిపారు. వివరాల కోసం 9292757888ను సంప్రదించాలన్నారు.

- స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ చెస్ డివిజనల్ స్థాయి పోటీలు శనివారం ఉదయం 9 గంటలకు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఏ పీఈటీ డివిజనల్ కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని మండల ఇన్‌చార్జిలు తమ మండల జట్లను తీసుకుని రావాలని కోరారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం



ఫారెస్టు కార్యాయలం ఆవరణంలో ఉన్న నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ విజయ్‌కుమార్

రుద్రవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అడవుల్లో జరిగే అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎఫ్‌డీపీటీ (ఫీల్డ్ డైరెక్టరు ప్రాజెక్టు టైగర్) విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని ఫారెస్టు కార్యాలయ ఆవరణంలోని నర్సరీలో మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రూ.20 కోట్ల మేర పచ్చర్ల, గాజులపల్లె, చెలిమ ప్రాంతాల్లో అక్రమ రవాణా జరుగుతుందన్నారు. అడవులు ప్రజల ఆస్తి అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఉద్యోగులు పనిచేయలేకపోతే సెలవులో వెళ్లాలని సూచించారు. నల్లమల అటవీలో వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అక్రమ రవాణా, వేటగాళ్లకు సిబ్బంది సహకరించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట రేంజర్ ముర్తుజావలి ఉన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా 240 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందన్నారు. జిల్లాలో 2203 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, బీజేపీ పార్టీ తరుపున పీటీ సాయి ప్రదీప్, టీడీపీ ఎల్‌వీ ప్రసాద్, జనసేన మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 15వ వార్డులోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ పార్కులో 15వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పామన్న ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శివమ్మ, ఇన్‌చార్జి పామన్న, నాయకులు అబ్బాస్, జేమ్స్ రవికుమార్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించండి


ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ల ద్వారా రుచికరమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ డాక్టర్.ఏ.సిరి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. భోజనం నాణ్యత, రుచి పరిమాణం, సర్వింగ్ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, క్యాంటిన్ ప్రాంగణం పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రతి వారం మండలాలకు వెళ్లాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం, మండల స్పెసల్ ఆఫీసర్లు ప్రతి వారం తప్పనిసరిగా మండలాలకు వెళ్లాలని కలెక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎనర్జీ, నెడ్‌క్యాప్, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, మైన్స్ అండ్ జియాలజీ, సంక్షేమ శాఖలు, మున్సిపాలిటీలు, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ, మండల స్పెషల్‌ఆఫీసర్లు కేటాయించిన మండలాలకు ప్రతి వారం తప్పనిసరిగా వెళ్లి, ఆసుపత్రులు, పాఠశాలలు, హాస్టళ్ల అంగన్‌వాడీ సెంటర్లు, సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయనమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జేడీ శ్రీనివాసులుకు సన్మానం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుందని, వీటిని విజయవంతం చేయడంలో కర్నూలు జిల్లా జేడీ శ్రీనివాసులు కృషి చేశారని కలెక్టర్ ఏ. సిరి అన్నారు. జేడీ శ్రీనివాసులును డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ జహరుల్లా, డీఈవో శామ్యూల్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీఆర్‌డీఏ పీడీ వెంకటరమణయ్య, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి సన్మానించారు.

కార్మిక రాజ్యస్థాపన ఏఐటీయూసీ లక్ష్యం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికరాజ్య స్థాపన ఏఐటీయూసీ లక్ష్యమని జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నగరంలోని కార్యాలయంలో సీనియర్ నాయకులు ఎన్.మనోహర్‌మాణిక్యం జెండాను ఎగువేశారు. అనంతరం ఏఐటీయూసీ జాతీయ మాజీ కార్యదర్శి అమరజీవి గురుదాస్ గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.. చంద్రశేఖర్, అధ్యక్షుడు బి. వెంకటేష్, ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఆర్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.
● హోటల్ అండ్ బేకరీ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ఏఐటీయూసీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. హోటల్, బేకరీ కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కే.రామక్రిష్ణారెడ్డి, ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, జి.చంద్రశేఖర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వైద్య సేవలను కొనసాగించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలను కొనసాగించాలని సీపీఐ సీనియర్ నాయకులు కే.జగన్నాథం డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో పెండింగ్ నిధులు విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు. జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోయి 20 రోజులు దాటుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం కూడా స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.2700 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగరాజు, బీసన్న, అన్వర్, సోమన్న, అఖిల, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రైల్వే సమస్యల పరిష్కారానికి శని, ఆదివారం చేపట్టే నిరసన దీక్షలు, మహాధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు అన్నారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో ఆయన మాటాడుతూ రాజధాని అమరావతికి రెగ్యులర్‌గా ప్రయాణం చేయాలంటే ఒక్క రైలు కూడా లేదన్నారు. ప్రస్తుతం కాచిగూడ నుంచి గుంటూరు వరకు వెళ్లే రైలు మాత్రమే ఉందన్నారు. దీని వల్ల నగర ప్రజలు బస్సులపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. నగర నుంచి విజయవాడకు రెగ్యులర్‌గా రైలు నడపాలని, మచిలీపట్నం రైలును పునరుద్ధరించాలని, కర్నూలు నుంచి విశాఖ, కాకినాడకు వారంలో రెండురోజులు నడుస్తున్న రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డోన్ వరకు జరుగుతున్న డబుల్ లైన్ పనులు త్వరితగతని పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు నగేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఓర్వకల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు సహకార పరపతి సంఘాన్ని జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సొసైటీ అధ్యక్షుడు సి.సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని సొసైటీ భవనంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం ఉన్న ఐదు మంది రైతులకు పంట రుణాలు రూ.13,09,500 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. మిగతా రూ.50లక్షలు కూడా రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు సొసైటీ సిద్ధంగా ఉందన్నారు. సీఈవో మద్దిలేటి, సొసైటీ సభ్యులు చెన్నూరు భాస్కర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రైతులు లక్ష్మికాంతరెడ్డి, రామకోటేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.




సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత


నగర పాలక కార్యాలయంలో...

దేశాభివృద్ధికి సమైక్యంగా కృషి చేయాలి

● జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం మనమంతా ఒక్కటే అనే సమైక్య భావంతో మెలగాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ మిని సమావేశభవనంలో సర్దార్ వలభాయ్ పటేల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు మురళీమోహన్‌రెడ్డి, సి.రాంగోపాల్, బసవశేఖర్, నాగేంద్రప్రసాద్, అబ్దుల్ హక్, బాబుభాస్కర్, పుల్లయ్య, మాధవి, వాణి, సోనియా తదితరులు పాల్గొన్నారు.
● నగర పాలక కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మేనేజర్ చిన్నరాముడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ జునైద్, సూపరింటెండెంట్లు రామక్రిష్ణ, క్రిష్టఫర్, సిబ్బంది శ్రీదేవి, కృష్ణ మోహన్, శోభారాణి, సరస్వతి, సుజాత, భార్గవ్ పాల్గొన్నారు.
కోడుమూరు: స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ డి.వై స్వామి జాతీయ ఐక్యతా దినోత్సవం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీఐ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ ముఖ్య పాత్ర పోషించాడని అన్నారు. భారతదేశం ఐక్యతను చాటి దేశం అభివృద్ధికి పాటు పడిన సర్దార్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. అనంతరం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
కల్లూరు: ఉక్కు మనిషి భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరుచరితారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ తొలి హోంమంత్రిగా, ఉప ప్రధానిగా విశేష సేవలందించిన మహనీయుడని కొనియాడారు. దృఢ సంకల్పంతో నాయకత్వ పటిమకు, దేశ ఐఖ్యతకు ప్రతిరూపమన్నారు. కార్యక్రమంలో నన్నూరు సింగిల్‌విండో అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, పుసులూరు ప్రబాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, పెరుగు పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
కర్నూలు అర్బన్: జాతీయ ఐక్యత దినోత్సవాన్ని జరుపుకోల్సిన అవశ్యకత ఉందని ఉపకులపతి, ప్రొఫెసర్ షావలి ఖాన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వి. లోకనాథ్, ప్రిన్సిపల్ మహబూబ్ బాషా, అద్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కర్నూలులోని కాంగ్రెస్ కార్యాలయంలో...


కోడుమూరు: రన్ ఫర్ యూనిటీలో పోలీసులు

● నిరుపేదల జీవితాల్లో మాజీ ప్రధానీ ఇందిరమ్మ వెలుగులు నింపారని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు సుధార్ బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ 41వ జయంతి, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం, ఎస్సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, కే. రాఘవేంద్రరెడ్డి, సూర్యప్రకాస్ రెడ్డి పాల్గొన్నారు.
కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని ఏ.క్యాంపులో షైఫర్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నేషనల్ యూనిటీడే ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్ ముందుగా సర్దార్ వల్లభాయ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం: ఎమ్మెల్యే

కర్నూలు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గంలో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు మండలం పసుపుల గ్రామంలో తన స్వగృహంలో శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల అభ్యర్థనలు, అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు వివరించారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందేలా చొరవ తీసుకోవడం జరిగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తన దృష్టికి తీసుకవస్తే తనవంతుగా పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ ప్రజలకు హామినిచ్చారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

ఆర్‌యూ రిజిస్ట్రార్ పదవి స్థానికులకే ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా స్థానిక ప్రొఫెసర్లనే నియమించాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఏ, ఆర్‌పీఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థులతో విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్. నాగార్జున, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్, ఆర్‌పీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, కళాశాలల యాజమాన్యాలు, రిజిస్ట్రార్ కుమ్మకై విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడుతున్నారని మండిపడ్డారు. యోగి వేమన యూనివర్సిటీ నుంచి డిప్యుటేషన్‌పై జిల్లాకు వచ్చిన ఆయన ఏడాది పదవీ కాలం పూర్తయినప్పటికీ ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. సెక్యూరిటి ఏజెన్సీ కాంట్రాక్టు మొదలు, వసతి గృహాల్లో అనుకూలమైన వారిని నియమించుకోవడం, పనులు చేయకుండా బిల్లులు దండుకోవడం, ఇలా అనేక అక్రమాలపై ఫిర్యాదులు చేసిన ఉపకులపతి స్పందించడం లేదని, త్వరలో రిజిస్ట్రార్ హటావో కార్యచరణ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్. ఏఐఎస్‌ఏ. ఆర్‌పీఎస్‌ఎఫ్ యూనివర్సిటీ నాయకులు ఆలీ, కిరణ్, మహేష్, మహమ్మద్, బార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

మఠంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి


వీరబ్రహ్మేంద్రస్వామి మఠాన్ని పరిశీలిస్తున్న కె. పార్వతమ్మ

కల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్షన్ కె.పార్వతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె కందికాయపల్లె గ్రామంలో స్వామి అమ్మవారి మఠాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వడ్ల శ్రీనివాస్, డా.సత్యానారాయణ, శోభన్‌బాబు, ఎస్.రాఘవేంద్ర, రామాచారి, విశ్వరూప ఆచారి తదితరులు పాల్గొన్నారు.

హాకీ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో హాకీ ప్రారంభించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా నవంబరు 7న హాకీ ఇండియా.. హాకీ ఆంధ్రప్రదేశ్, హాకీ కర్నూలు వారి ఆధ్వర్యంలో జరిగే శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలనీ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ కోరారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హాకీ శతాబ్ది ఉత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు రెడ్డి సంఘం సురేంద్ర, ప్రవీణ్, అరుణ్ రవికుమార్, మనోహర్, సీనియర్ క్రీడాకారులు ప్రతాప్, పెద్దయ్య, చిన్న సుంకన్న, కన్నా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా డ్వామాలో టెక్నికల్ అసిస్టెంట్లుగా (టీఏలు) పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కంచాలని జిల్లా టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో వారు డ్వామా పీడీ వెంకట రమణయ్య వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలేష్, ఇతర ప్రతినిధులు నాగ మల్లేశ్వరి, శ్యామల, రామాంజనేయులు, ఆనంద్, శివరాజ్, లక్ష్మణ్ నాయక్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.
కర్నూలు అగ్రికల్చర్: జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలేష్, సెక్రటరీ రాముడు, ట్రెజరర్ బషీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం డ్వామా కార్యాలయంలో పీడీ వెంకటరమణయ్యకు వినతి పత్రం అందజేశారు.

9న కార్తీక వనభోజనం


మంత్రి టీజీ భరత్‌ను సత్కరిస్తున్న బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబరు 9న కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కదిరి రమేష్ తెలిపారు. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలో గల శ్రీ లలితాపీఠంలో ఆ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హాజరవుతారని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎన్ మల్లికార్జున, గౌరవ సలహాదారులు బెస్త రామయ్య, బెస్త ఈరన్న, బి. మల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ బెస్త జలగరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వేటపాలెం శ్రీనివాసులు, బి. నాగరాజు పాల్గొన్నారు.
కర్నూలు ఎడ్యుకేషన్: కార్తీక మాసం సందర్భంగా నవంబరు 9న రజక వనభోజన మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజక కార్తీక మాస వనభజోజనాన్ని జయప్రదం చేయాలని రజక ఐక్యసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వేంపెంట రాంబాబు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆహ్వాన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నాయకులు గోల్డ్ శ్రీను, అడ్వకేట్ చంద్రశేఖర్, కేతూరి మధు, భారతి, అంజి, కటారుకొండ సాయికుమార్, కనకం రఘు పాల్గొన్నారు.

కార్తీక వన భోజన కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం


పెంచికలపాడులో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన కార్యక్రమాన్ని పెంచికలపాడులో ఆదివారం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని మండల కురువ సంఘం అధ్యక్షుడు కె కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పెంచికలపాడులో కార్తీక వన భోజన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామ కురువ సంఘం అధ్యక్షుడు రాముడు, విజయ్, మద్దిలేటి, సుంకన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక ఆరోగ్య అధికారి బాధ్యతల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగర పాలక ప్రజారోగ్య అధికారిగా డా.వై. నాగప్రసాద్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గూడూరు పట్టణంలోని ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్న ఆయనను డిప్యూటేషన్ ప్రాతిపదికన ప్రభుత్వం నగర పాలకకు బదిలీ చేసింది.

పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనుల్లో కాలపరిమితి దాటిన పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నగర పాలక అధికారులు నోటీసులు జారీ చేశారు. కార్పొరేషన్ అధికారులు బిల్లులు పెండింగ్ పెట్టారని ఇటీవల జరిగిన మంత్రి సమావేశంలో మంత్రి టీజీ భరత్ దృష్టికి కాంట్రాక్టర్లు తీసుకెళ్లారు. పనుల్లో నాణ్యత లోపించడంతో కమిషనర్ తాజాగా 22 మంది కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశారు.

తిప్పాయపల్లెలో కూలిన ఇల్లు

ఓర్వకల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో వృద్ధురాలు చాకలి మద్దమ్మ ఇల్లు శుక్రవారం తెల్లవారు జామున భారీ వర్షాలకు మట్టిమిద్దె తడిసిపోయి కులిపోయింది. అయితే ఆ వృద్ధురాలు వరండాలో ఉండడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కుప్పకూలిన ఇంటిని పంచాయతీ కార్యదర్శి సందర్శించారు. బాధితురాలికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజల ఆమోదంతో విస్తరణ పనులు

● నగర పాలక సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధిలో భాగంగా చేపట్టే రహదారి విస్తరణ పనులను ప్రజలందరి ఆమోదయోగ్యంతోనే కొనసాగిస్తామని నగర పాలక సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు చేపట్టే రహదారి విస్తరణలో భాగంగా, ఉస్మానియా కళాశాల వద్ద కొలతలను రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ బృందం పరిశీలించారు. గురువారం మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రహదిర విస్తరణకు సంబంధించి కొంతమంది బాధితులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని కమిషనర్ ఆదేశాల మేరకు మరోసారి కొలతలు పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ భాష, బిల్డింగ్ సూపర్‌వైజర్ మదుగోపాల్, ప్లానింగ్ కార్యదర్శులు హుసేనయ్య, అక్రం, రవితేజ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంస్థలను బలోపేతం చేస్తాం

● డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థలను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శుక్రవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నగరంలోని పాలిక్లీనిక్ ప్రాంగణంలో నిర్వహించిన వర్క్‌షాపులో నాగేశ్వర్‌రావు యాదవ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, అతివృష్టి, అనావృస్టి సమయాల్లో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ రాజేష్, జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాల్వబుగ్గకు కంచి పీఠాధిపతి రాక

ఓర్వకల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయానికి శనివారం కంచి కామకోటి పీఠం పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వామీజీ వస్తున్నట్లు ఆలయ ఈవో మద్దిలేటి శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రజలు, భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

కోడుమూరు రూరల్, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీవో రాముడు సూచించారు. శుక్రవార గోరంట్లలో గ్రామ లేఅవుట్ సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో ఎంపీడీవో మాట్లాడారు. నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం బిల్లులు అందిస్తోందని, అయినా నిర్మాణాల్లో జాప్యం తగదని అన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు

● అధునాతన బారికేడ్స్‌ను ప్రారంభించిన ఎస్పీ


బారికేడ్‌లను ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రహదారి భద్రత నిబంధనలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అధునాతన ట్రాఫిక్ నియంత్రణ బారికేడ్ పరికరాలను ఆయన ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ట్రాపిక్ రూల్స్‌ను పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణకు ట్రాఫిక్ పోలీసులు వినూత్నమైన కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రజలకు, విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. సామాజిక బాధ్యత కలిగిన జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్ బాలాజీ ఆయిల్స్ వస్త్రాలయ షాపింగ్ మాల్ దాతల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణకు 80 బారికేడ్స్ అందించారన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, కిమ్స్ హాస్పిటల్ సీవోవో డా.సునీల్ కుమార్, జేమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సీఈవో డా.చంద్రశేఖర్, బాలాజీ ఆయిల్స్ అధినేత షరఫ్ సత్యదేవ, వస్త్రాలయ షాపింగ్ మాల్ అధినేత వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం పూజలు


కార్తీక మాస ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న నిత్యాతృప్తదాస్‌జీ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా శైవ, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, మహిళలతో సామూహిక దీపోత్సవాలను ఘనంగా నిర్వహించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో, నగరంలోని మాధవీనగర్‌లోగల శివరామాలయంలో కార్తీక మాసం విశిష్టను తెలియజేస్తూ నిత్యాతృప్తదాస్‌జీ భక్తులకు ప్రవచన బోధన చేశారు. ఈ కార్యక్రమంలో శివరామాలయం కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి రాజశేఖర్‌రావు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఘనంగా సత్కరించి, ఆలయ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.
● పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోగల లలితాపీఠంలో వేద పండితుడు మామిళ్లపల్లి రాజేశ్ శర్మ ఆధ్వర్యంలో, పీఠాధిపతి గురుమేడా సుబ్రహ్మణ్యం స్వామి పర్యవేక్షణలో ఈ పూజలు చేశారు.
● నేడు పేట రామాలయంలో 13 అడుగుల రాముని విగ్రహం ఆవిష్కరణ..పాతనగరంలోని పేట మెయిన్ బజార్ రామాలయంలో ఇటీవల పూర్తయిన ఆయన శతాబ్ది ఉత్సవాల గుర్తుగా 13 అడుగుల శ్రీరాముని విగ్రహం ఆవిష్కరణ చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడుప మాళిగి హనుమేశాచార్య తెలిపారు.

శనివారం 1 నవంబరు 2025 ఆంధ్రజ్యోతి కర్నూలు జిల్లా వార్తలు www.andhrajyothy.com

దేవాలయాల్లో వరుస దొంగతనాలు

హొళగుంద, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దేవాలయాలే టార్గెట్‌గా వారం రోజుల్లో మూడు దేవాలయాల్లో వరుస దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గురువారం వందవాగాలి గ్రామంలోని శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు గుడి గంటలు, అమ్మవారి మెడలోని అర్థతులం బంగారు తాళి బొట్టు దొంగతనం చేసినట్లు పూజారి దాసరి విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీరామ్ నగర్‌లోని రాముని దేవాలయం నెల రోజుల క్రితం సీతమ్మ వారి మెడలోని బంగారు తాళి బొట్టులు దొంగతనం జరుగగా, ఐదు రోజుల క్రితం అదే దేవాలయంలో హుండీ పగలగొట్టారు. అలాగే మార్లమాడికి గ్రామంలోని జ్యోతి నగర్‌లో ఉన్న మరో దేవాలయంలో సైతం దొంగలు హుండీ పగలగొట్టి డబ్బులు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి

ఆదోని రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 4వ తేదిన అంగన్‌వాడీ వర్కర్, ఆయాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని సీడీపీఓ డిల్లీశ్వరి తెలిపారు. మండలంలో ఒక వర్కర్, 8 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటికి 46మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. 4వ తేదిన స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా దరఖాస్తుకు పొందుపరిచిన ఒరి.జినల్ సర్టిఫికేట్లను తెచ్చుకోవాలన్నారు.

ఇందిరాగాంధీ 41వ వర్ధంతి

ఆదోని టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ అధ్యక్షుడు సాయినాథ్ కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధానమంత్రి పదవిని చేపట్టిన ప్రపంచంలోనే రెండవ మహిళగా ఆమెకు గుర్తింపు లభించిందని, దేశంలో అనేక సంస్కరణలను తీసుకొని వచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. దిలీప్ ధోకా, మారుతి, శ్రీనిత్, దేవిశెట్టి వీరేష్, హనుమంతు, నిసార్ అహ్మద్, తాయన్న పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

- ఐక్యతా దివస్‌లో పాల్గొన్న రాజకీయ నాయకులు, ప్రముఖులు, విద్యార్థులు
- ఆదోనిలో 130 అడుగుల జెండా ప్రదర్శన
- పటేల్ సేవలు గుర్తు చేసుకునేలా కార్యక్రమాలు



ఆదోనిలో పరుగు పందెం ప్రారంభిస్తున్న పోలీసులు



దేవనకొండలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పోలీసులు



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ఆలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు శుక్రవారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ హాజరయ్యారు. దేశంలో రాజకీయాల్లో నిస్వార్థంగా పనిచేసి దేశానికి ఉపప్రధానిగా పనిచేసి భారతరత్నను అందుకున్నారన్నారు. ప్రస్తుత ప్రధాని మోదీ ఆయన అడుగుజాడల్లో నడిచి ముందుకు సాగుతున్నారన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ రంగడు, జనసేన నాయకులు రంజిత్, బీజేపీ నాయకులు విట్టా రమేష్, వెంకటరాముడు, నాయకులు చిదానంద, బసవరాజు, టీడీపీ నాయకులు నరసప్ప, కృష్ణయాదవ్, సాలీసాహెబ్, ఉచ్చీరప్ప, నరసన్న, ముద్దురంగ, గూళ్యం రామాంజినేయులు, కొమ్ము రాజు, మసాల జగన్ పాల్గొన్నారు.

దేవనకొండ: దేశ స్వాతంత్ర్యంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని ట్రైనీ ఎస్ఐ నరేష్ అన్నారు. స్థానిక బస్టాండు ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 15వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. బస్టాండు నుంచి క్రాస్ రోడ్డు వరకు 2కే పరుగు పందెం చేపట్టారు. పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటి సర్దార్ సేవలను స్మరించుకున్నారు. పోలీసులు చెన్నయ్య, ప్రదీప్, ఈశ్వరయ్య, శ్రీరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆదోని అగ్రికల్చర్ : ప్రతి ఒక్కరూ జాతీయ సమగ్రతను చాటాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవ ర్యాలీని చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రధాన రహదారుల గుండా ఎమ్మిగనూరు సర్కిల్ వరకు 130 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, అధ్యాపకులు రామకృష్ణ, ఎర్రిస్వామి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ గోవిందు, ఎన్‌సీసీ డివిజన్ అధికారి జోనాథన్ వీక్లిఫ్, ఉమాదేవి, వెంకటరామిరెడ్డి, సంతోషి నేత్రావతి పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : సర్దార్ వల్లాబాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా, పోలీసుల ఆధ్వర్యంలో యువతకు పరుగుపందేం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6గంటలకు ఆస్పరి బైపాస్ నుంచి ఎమ్మిగనూరు బైపాస్ వద్ద ఉన్న బసవేశ్వర విగ్రహం వరకు యువతకు పరుగు పందెం నిర్వహించి గెలుపొందిన వారికి పోలీసులు మెమెంటోలు అందజేశారు. రూరల్ సీఐ నల్లప్ప, ఎస్.ఐ రామాంజనేయులు, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

తుగ్గలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న కళాశాలల ప్రైవేటీకరణ, విరమించుకోవాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్, వైసీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జడ్పీటీసీ పులికొండనాయక్, అన్నారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, మిద్దె తాండా గ్రామాల్లో కోటి సంతకాల సేకరణపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ జిట్టా లక్ష్మీదేవి, మాజీ జడ్పీటీసీ నారాయణ నాయక్, ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై రామస్వామి, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలీషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు పోలీస్ శాఖ ఈగల్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో- అవేర్‌నెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్న వయసులోని మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలతో ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు నాశనం అవుతుంద న్నారు.

ఉత్తుత్తి మాటలతో ఎమ్మెల్యే కాలయాపన

ఆదోని టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాటల మాంత్రికుడిగా ప్రజలకు ఉత్తుత్తి మాటలు వినిపించి ఎమ్మెల్యేగా గెలిచిన డా. పార్థసారథి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా పట్టణంలో ఒక్క అభివృద్ధి కూడా చేయలేకపోయారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ విమర్శించారు. చేతికి మైక్ దొరికితే చాలు, ప్రతిపక్ష పార్టీలను విమర్శించడమే పనిగా పెట్టుకొన్న ఆయన పట్టణంలో ఒక్క రోడ్డు కూడా వేయించలేకపోయారని విమర్శించారు. సినిమా డైలాగులు చెప్పడం ఆపి, ప్రజల అవసరాలు తీరేలా అభివృద్ధి చేసి చూపించాలని హితవు పలికారు. దిలీప్ ధోకా, యువజన మారుతి రావు,దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్, హనుమంతు, తాయన్న, రామన్న యాదవ్, నిసార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

ఆలూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శుక్రవారం అరికెర గ్రామంలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి పంటలను ఆమె పరిశీలించారు. ఎంతో ఆశతో పెట్టుబడులు పెట్టామని, వర్షాల వల్ల పత్తి పంట నష్టం వాటిల్లిందని రైతులు వైకుంఠం జ్యోతికి మొరపెట్టుకున్నారు. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు, కలెక్టర్ సిరి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. బొగ్గుల రాముడు, కోసిగిశ్రీనివాసులు, బొగ్గుల ఈరన్న, నరసప్ప, గూళ్యం రామాంజినేయులు, శేఖన్న, మంగన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో అవినీతి

ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప


సబ్‌కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్న దేవేంద్రప్ప

ఆదోని, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సరఫరాలో అవినీతికి పాల్పడుతున్న సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. సీఎస్‌డీటీగా పనిచేస్తున్న రుద్రగౌడ్ ప్రతినెలా రేషన్ డీలర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన డీలర్లకు మాత్రమే సమయానికి రేషన్ కోటా (బియ్యం) సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఈ అన్యాయంపై పలువురు డీలర్లు తన వద్దకు వచ్చి వాపోయారని తెలిపారు. రుద్రగౌడ్ అవినీతి ప్రవర్తనపై ఆదోని సబ్‌కలెక్టర్ తక్షణ విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పోరాటాలతో ప్రతిఘటిస్తాం


పత్తికొండలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాట త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తే పోరాటాలతో ప్రతిఘటిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య హెచ్చరించారు. శుక్రవారం పత్తికొండలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే 1920 అక్టోబర్ 31న ముంబై మహానగరంలో కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ పురుడుపోసుకుందని గుర్తు చేశారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, నాయకులు కారుమంచి, రామాంజనేయులు, కారన్న, వెంకటరామిరెడ్డి, మారన్న, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుదాస్ గుప్తా వర్ధంతి

ఏఐటీయూసీ అగ్ర నాయకులు, ప్రముఖ పార్లమెంటేరియన్ గురుదాస్ గుప్తా 6వర్ధంతి వేడుకలను స్థానిక సి.ఆర్.భవన్‌లో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కృష్ణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తూ ఆయన కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు.

ఆదోని రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల సేవలు తరిస్తున్నాయని ఏఐటీయూసీ నాయకులు అజయ్ బాబు, నాగరాజు, మల్లప్పలు తెలిపారు. 105వ ఏఐటీయుసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారు జెండావిష్కరించారు.

దేవనకొండ: దేశంలోనే కార్మిక హక్కులకై పోరాటాలు చేయనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు నరసారావు అన్నారు. దేవనకొండ క్రాస్ రోడ్డులో హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ఎదుట ఏఐటీయుసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. గంగన్న, నాగరాజు, రమేష్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆయా రంగాల కార్మిక సోదరులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మాధవస్వామి, కార్యదర్శి గిరి, పాతబస్టాండ్ సర్కిల్, ఆటో స్టాండ్ నందు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు యేసయ్య, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్యలు సంయుక్తంగా జెండా ఆవిష్కరణ చేశారు.

మాక్ అసెంబ్లీ సమావేశాలకు ఆదోని విద్యార్థిని


వంశితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చట్టసభలపైన అవగాహన కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం నవంబర్ 26న తలపెట్టిన మాక్ అసెంబ్లీ సమావేశాలకు ఆదోని నియోజకవర్గం నుంచి నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వంశిత ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ అభినందించారు. ఉపాధ్యాయులు రాజా సతీష్, రమేష్ నాయుడు, నాగేశ్వర్ నాయుడు, జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్,రాష్ట్ర స్కిల్ హబ్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో 18 ఏళ్ల నుంచి 42 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలకు టైలరింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9177413642, 9989109688 నంబర్‌లను సంప్రదించవచ్చు అన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట


మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఆదోని రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలంలో తాగు, సాగునీరు సమస్య పరిష్కారం కోసం సీపీఎం పోరుబాట పట్టనుంది. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తుంగభద్ర సమీపంలో ఉన్న మేళిగనూరు వద్ద కాల్వ నిర్మించాలని, గూళ్యం వద్ద వేదావతి ప్రాజెక్టు నిర్మించాలని, ఈప్రాజెక్టుల వలన రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ముఖ్యంగా ఎల్లెల్సీ ద్వారా కేవలం 4 గ్రామాలకు మాత్రమే సాగునీరు అందుతుందని, మిగిలిన 4గ్రామాలు వర్షంపై ఆధారపడాల్సి వస్తుందని, కావున ప్రాజెక్టు సాధన కోసం సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశులు,

యథావిధిగా ఎన్టీఆర్ వైద్యసేవలు


మాట్లాడుతున్న నీలకంఠ

పత్తికొండ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ శ్రీరామ్ ఆసుపత్రిలో యదావిధిగా ఎన్టీఆర్ వైద్య సేవలు కొనసాగుతాయని ఆసుపత్రి ఎండీ డా. నీలకంఠ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించని కారణంగా అక్టోబర్ నెల 10వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిపివేయడం జరిగిందన్నారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ చర్చలు జరిపిన ఫలితంగా త్వరలోనే బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అందుకే ప్రభుత్వం నుంచి స్పందన లభించడంతో నేటి నుంచే పత్తికొండలోని శ్రీరామ్ ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు కొనసాగుతాయన్నారు. ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దికెర, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులు పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి లక్ష్మన్న తెలిపారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు నట్టల నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. వర్షాలు పడే సమయంలో పశువులు, గొర్రెలు, మేకలను ఎత్తయిన ప్రాంతాల్లో ఉంచాలన్నారు. అవసరాలకు అనుగుణంగా పశువులకు మేత నిల్వ ఉంచాలని సూచించారు. విద్యుత్ స్థంభాలు, తీగలకు దూరంగా పశువులను ఉంచాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

హాలహర్వి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన గ్రామాల మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సాధికారత సంస్థ జిల్లా కార్యదర్శి రేగుల చంద్రకల సూచించారు. మహిళలు మారుతున్న కాలాన్ని బట్టి ముందుకు రావాలని, కుటుంబాలను చక్కదిద్దుకొని సమాజంలో ఏర్పడే సమస్యలను అధిగమించి విజయం వైపు దూసుకెళ్లాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు నిర్మాణ పనుల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి ఫారం సమీపంలో నిర్మిస్తున్న టెక్స్‌టైల్ పార్కు పనులతో పాటు ఎంఐజీ లేఔట్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ నూరుల్ క్వామర్ పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనులపై స్థానిక తహసీల్దార్ శేషఫణిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్, తహసీల్దార్ శేషఫణి, కుడా అధికారులు ఉన్నారు.

సీఐకి ఉత్తమ పురస్కారం



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ రామాంజులు

మంత్రాలయం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రామాంజులుకు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు అందుకున్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని సీఐ రామాంజులు అందుకున్నారు. ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనలో బందోబస్తు నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించినందుకు ఎస్పీ అభినందనలు తెలిపి ప్రశంసాపత్రం అందజేశారు.

భార్య కాపురానికి రాలేదని.. సెల్ టవర్ ఎక్కిన భర్త

మంత్రాలయం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామచంద్రనగర్‌కు చెందిన మోహన్ అనే యువకుడు తన భార్య కాపురానికి రాలేదని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. మూడేళ్ల క్రితం రామచంద్రనగర్‌కు చెందిన స్నేహలతతో మోహన్‌కు ప్రేమ వివాహమైంది. వీరికి ఒక కుమార్తె సంతానం. వీరి మధ్య చిన్న గొడవ జరిగి మనస్తాపానికి గురైన మోహన్ టవర్ ఎక్కాడు. అప్పట్లో గ్రామస్తులు, పోలీసులు సర్ది చెప్పి టవర్ నుంచి దించారు. శుక్రవారం సాయంత్రం మళ్లీ టవర్ ఎక్కి దూకుతానని బెదిరించాడు. సంఘటనా స్థలానికి చేరుకుని మంత్రాలయం పోలీసులు, గ్రామస్థులు కిందకు దిగాలని మైకుల ద్వారా అనౌన్స్ చేసి ఫోన్‌లో మాట్లాడారు. ఎంతకీ దిగరాకపోవడంతో చీకటి పడటం వల్ల పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అందరూ వెళ్లిపోయాక టవర్ నుంచి మోహన్ కిందకు దిగడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ విషయంలో ఘర్షణ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ చోటు చేసుకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల పెద్ద సంగాల యంకన్నతో పాటు అతని కుమారుడు నరసింహులను దాయాదులైన లక్ష్మన్న, అతని కుమారుడితోపాటు మరో నలుగురు కలిసి చెలుకుపార, కట్టెలతో కొట్టారన్నారు. ఈఘర్షణలో యంకన్న, లక్ష్మన్నలకు రక్తగాయాలయ్యాయన్నారు. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన యంకన్న

జీడీపీలో సిబ్బంది కొరత

- విధుల్లో నలుగురు మాత్రమే
- సిబ్బంది లేక డ్యామ్ నిర్వహణలో ఇబ్బంది పడుతున్న వైనం
- మరో మూడేళ్లకు అంతా రిటైర్డ్

గోనెగండ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా గాజులదిన్నె ప్రాజెక్టును సిబ్బంది కొరత వేధిస్తోంది. కొత్త సిబ్బందిని నియమించాలనే ఆలోచన ఉన్నతాధికారులకు రాకపోవడం విచారకరం. దీంతో ప్రస్తుతం ఉన్న అరకొర సిబ్బంది ఇబ్బందుల పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు గత కొన్నేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ప్రాజెక్టు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు నిర్వహణకు ఆరుమంది లస్కర్‌లు, ఆరుమంది టెక్నికల్ సిబ్బంది, నైట్ వాచ్‌మెన్‌లు ఇద్దరు ఉండాలి. కాని ప్రస్తుతం కేవలం ముగ్గురు లస్కర్‌లు, ఒక కాంట్రాక్ట ఉద్యోగి, ఒక వర్క్‌ఇన్స్‌ఫెక్టర్ మాత్రమే ఉన్నారు. దీంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరినప్పుడు నీటి విడుదల సమయంలో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. సిబ్బంది లేక పోవడతో రాత్రి పగలు ఉన్న నలుగురితోనే పనులు చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో సకాలంలో చేయాల్సిన పనులు జరగడం లేదని జీడీపీ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గత రెండు నెలలుగా ప్రాజెక్టుకు నీరు వరద రూపంలో ఎక్కువగా చేరుతోంది. గత నెల 12 తేది నుంచి నేటి వరకు దాదాపు 28 సార్లు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. అయితే గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ నిర్వహణ నిదుల కింద రూ. 2లక్షలు విడుదల అయ్యాయి. అత్యవసరం కావున ఆ నిధులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు నెలల పాటు ముగ్గురి వ్యక్తులను కాంట్రాక్ట కింద ఏర్పాటు చేసుకున్నారు. వారు నవంబరు నెల చివరి వరకు మాత్రమే పనిలో ఉంటారు. ప్రాజెక్టులో రిటైర్డ్ అయిన వారి స్థానంలో మరో కొత్త ఉద్యోగుల నియామకం జరగడం లేదు. దీంతో 14 మంది ఉండాల్సిన స్థానంలో కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఉన్న ముగ్గురు రెగ్యూలర్ ఉద్యోగులు కూడా మరో మూడేళ్లకు రిటైర్డ్ అవుతారు. ఇక నియామకాలు జరగక పోతే ఇక మూడేళ్లకు ప్రాజెక్టులో పనిచేసే సిబ్బంది ఒక్కరు కూడా ఉండరు అన్నది వాస్తవం. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణకు క్రష్ట్ గేట్లకు వేసేందుకు గ్రీస్, ఇతర అవసరాలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాల్సి ఉంది. కాని గత ఆరేళ్లగా ఆ నిధులను విడుదల చేయడం లేదు. దీంతో అవసర సమయంలో గేట్లు ఎత్తలన్నా దించాలన్నా గేట్లకు గ్రీస్ పూయాల్సి ఉంది. అయితే నిధులు లేవు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులే సొంత సొమ్ముతో గ్రీస్‌ను ఇతర అవసర పరికరాలను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైౖ అధికారులు స్పందించి ప్రాజెక్టులో సిబ్బందిని ఏర్పాటు చేసి అవసరమైన నిధులను విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ప్రాజెక్టు విద్యుత్ బిల్లు కూడా దాదాపు రూ. 30లక్షల మేర పెండింగ్ ఉంది.



గాజులదిన్నె ప్రాజెక్టు

సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

ప్రాజెక్టులో సిబ్బంది కొరత ఉంది. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

● మహమ్మద్ ఆలీ, జీడీపీ ఏఈ

బడికి వెళ్లాలంటే ఇలా వేలాడాల్సిందే

- బాధ్యత ఆర్‌టీసీదే అంటున్న విద్యార్థి సంఘాలు
- విద్యార్థి బస్సులో గోనెగండ్ల విద్యార్థులను ఎక్కించుకోవాలి



గోనెగండ్ల నుంచి ఆటోలో వేలాడుతూ వెళ్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

గోనెగండ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సకాలంలో విద్యార్థులు కళాశాలకు, పాఠశాలకు వెళ్లాటంటే ఇలా ఆటోలకు వేలాడబడి వెళ్లాల్సిందే మరి. ప్రమాదం అని తెలిసినా విద్యార్థులు ప్రతిరోజు ఆటోలను ఇలానే ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రమైన గోనెగండ్ల విద్యార్థులు గాజులదిన్నె సమీపంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల లో విద్యనభ్యసిస్తున్నారు. వారు పాఠశాలకు, కళాశాలకు ఆటోలోనే వేలాడుతూ వెళతారు. ప్రతి రోజు గోనెగండ్ల నుంచి ఆటోల్లో 100 నుంచి 120 మంది విద్యార్థులు వెళుతుంటారు. ఒక్క ఆటోలో 15 నుంచి 20 మంది వరకు ఇరుక్కొని, వెనుక, ముందు ఆటోకు వేలాడుతూ ప్రయాణిస్తారు. ఇలా ప్రతి రోజుల వెలుతున్నారు. ఉహించని విధంగా ప్రమాదాలు జరిగితే ఏలా అని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె విద్యార్థులకు కోసం ఆర్‌టీసీ అధికారులు విద్యార్థి బస్సులను ఏర్పాటు చేసినప్పటికి అవి కేవలం పల్లెల విద్యార్థులను మాత్రమే ఎక్కించుకోని వెళతాయి. గోనెగండ్ల విద్యార్థులకు ఎక్కించుకోవని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నెకండ్ల, ఐరన్‌బండ గ్రామాల నుంచి మోడల్ స్కూల్ కు వెళ్లే విద్యార్థులక కోసం ఆర్‌టీసీ విద్యార్థి బస్సు ను ఏర్పాటు చేసింది. ఆది గోనెగండ్ల మీదుగానే గాజులదిన్నె మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లిల్సి ఉంది. అయితే ఆ బస్సులో గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు గాని జూనియర్ కళాశాల విద్యార్థులకు గాని అందులో ఆర్‌టీసీ సిబ్బంది ఎక్కించుకోరు. దీంతో గోనెగండ్ల విద్యార్థులు చేసేది లేక ఆటోలను అశ్రయిస్తు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైన ఆర్‌టీసీ అధికారులు స్పందించి విద్యార్థి బస్సులో గోనెగండ్ల విద్యార్థులను కూడా ఎక్కించుకోవాలని ఆటో ప్రమాదాల నుంచి తమ పిల్లలను కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రీడల్లో బాలికలు ప్రతిభ కనబరచాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు

మంత్రాలయం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో బాలికలు విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు, టీడీపీ నాయకులు మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పి.తాండా, విద్యానగర్, ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి బాలికల క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అండర్-17, 14 కబడ్డీ, ఖో-ఖో, యోగా, చెస్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావడి వెంకటేశ్., టీడీపీ మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల అధ్యక్షులు ఎస్.ఎం.గోపాల్ రెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, సురేష్ నాయుడు, మాజీ అధ్యక్షులు బసలదొడ్డి, ఈరన్న, జ్ఞానేష్, నరసప్ప, లక్ష్మన్న, నరసింహులు, వేమిరెడ్డి, చంద్ర, పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మురహరి రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు చెందిన కే.ఆర్ మురహరిరెడ్డిని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీకి చెందిన కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. బీజేపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా ఉన్న మురహరి రెడ్డి ఎన్నికలకు ముందు పోత్తులో భాగంగా సీటు కోసం ప్రయత్నించారు. అయితే సీటు రాకపోవడంతో మిన్నకుండి పోయారు. అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు. నెల రోజుల క్రితం బీజేపీని వీడి బుట్టరేణుక ఆధ్వర్యంలో తాడెపల్లిలో వైసీపీ అధినేత జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. దీంతో పార్టీ కమిటీ ఆయనను కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించింది. అలాగే ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ మధుబాబును జిల్లా ఎక్సక్యూటీవ్ మెంబర్ గాను, మల్లెపోగు సోముశేఖర్‌ను జిల్లా విద్యార్థి విభాగం సెక్రెటరీగా నియమించారు.



చెన్నారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



చెన్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నారెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన చెన్నారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శుక్రవారం పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. చెన్నారెడ్డి కుమార్తె, కుమారుడు చదువు విషయాలను అడిగి తెలుసుకున్నారు. నన్ను నమ్ముకున్న కార్యకర్తలు తనకు ముఖ్యమని వారి కోసం తాను ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. డాక్టర్ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, కార్యకర్తల ఆరోగ్య భద్రత తన బాధ్యత అన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త, టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ మల్లయ్య, సొసైటీ చైర్మన్ విరుపాక్షిరెడ్డి, కాపు మురళీకృష్ణారెడ్డి, బోడబండ సురేష్‌చౌదరి, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కడిమెట్ల చంద్ర, రవికుమార్, ఏనుగుబాల రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ యూనిటీ



మాట్లాడుతున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో నేషనల్ యూనిటీ డే, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు డీఎస్పీ బీవీ భార్గవి, సీఐ రామాంజులు ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో భాగంగా రాఘవేంద్ర సర్కిల్ నుంచి హెలిప్యాడ్ మైదానం వరకు జడ్పీ ఉన్నత పాఠశాల, రాఘవేంద్ర డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నేషనల్ యూనిటీ సందర్భంగా ఎస్ఐ శివాంజల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు, లక్ష్మినారాయణ, పరమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శివలింగం ఊరేగింపు



కలశాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

కౌతాళం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళంలో శుక్రవారం శివలింగం ఊరేగింపు కార్యక్రమం వైభంగా కొనసాగింది. గ్రామంలోని రామలింగేశ్వర దేవాలయంలో ఉన్న శివలింగం పాక్షికంగా దెబ్బతినడంతో పూజ చేయడం అరిష్టమని వివిధ మఠాల పీఠాధిపతులు తెలపడంతో గ్రామ పెద్దలు దెబ్బతిన్న శివలింగం స్థానంలో నూతన లింగాన్ని అని నిర్ణయించారు. నూతన లింగం శుక్రవారం గ్రామానికి చేరడంతో గ్రామ పొలిమేర నుంచి మహిళలు కలశాలతో గ్రామంలోకి భజనలు, బ్యాండు మేళాలతో గ్రామ వీధుల గుండా ఊరేగించారు. అక్టోబరు 3న దేవాలయంలో శాస్త్రోక్తంగా వేదపండితుల చేత ప్రత్యేక పూజలు చేయించి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



శివలింగం ఊరేగింపు దృశ్యం

దేవాలయాల్లో వరుస దొంగతనాలు

హొళగుంద, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దేవాలయాలే టార్గెట్‌గా వారం రోజుల్లో మూడు దేవాలయాల్లో వరుస దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గురువారం వందవాగాలి గ్రామంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు గుడి గంటలు, అమ్మవారి మెడలోని అర్థ తులం బంగారు తాళి బొట్టు దొంగతనం చేసినట్లు పూజారి దాసరి విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీరామ్ నగర్‌లోని రాముని దేవాలయం నెల రోజుల క్రితం సీతమ్మ వారి మెడలోని బంగారు తాళి బొట్టులు దొంగతనం జరుగగా, ఐదు రోజుల క్రితం అదే దేవాలయంలో హుండీ పగలగొట్టారు. అలాగే మార్లమాడికి గ్రామంలోని జ్యోతి నగర్‌లో ఉన్న మరో ఆలయంలో సైతం దొంగలు హుండీ పగలగొట్టి డబ్బులు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు.

'రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న రేషన్‌కార్డుదారులు, గ్రామస్థులు

కోసిగి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌మాన్ పేట గ్రామంలో రేషన్ డీలర్ ఆవుల మారెప్ప రేషన్ సక్రమంగా అందించకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడుతామని కార్డుదారులను బెదిరిస్తున్నాడని గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. ఈ రందర్భంగా లబ్ధిదారులు మదిరి పెద్ద లక్ష్మయ్య, కామన్‌దొడ్డి హుశేనీ, అరవ సురేష్, తిప్పలదొడ్డి ఎల్లమ్మ, ఫాతిమాబీ, వల్లూరు వీరారెడ్డి, గుడిసె వీరారెడ్డి, జ్ఞానేష్, మదిరి వీరారెడ్డిలు మాట్లాడుతూ గ్రామంలో రేషన్ డీలర్ మారెప్ప కార్డుదారులతో వేలిముద్రలు వేసుకుని రేషన్ సరకులు ఇవ్వడంలేదన్నారు. కొన్ని నెలల క్రితం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆదోని సబ్ కలెక్టర్ రెండుసార్లు డీలర్ మారెప్పను సస్పెండ్ చేశారన్నారు. అయితే కోర్టు ఉత్తర్వుల ద్వారా డీలర్‌కు సరుకులు వేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు.

జీనియస్ గ్లోబల్ స్కూల్‌ను సీజ్ చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగరాజు

గోనెగండ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్య హక్కు చట్టంకు వ్యతిరేఖంగా నడుపుతున్న గ్లోబుల్ స్కూల్‌ను విద్యాశాఖ అధికారులు సీజ్ చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రఘువీరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజు మాట్లాడుతూ పెట్రోల్ బంకును ఆనుకొని ఫైర్ సేఫ్టీ లేకుండా పాఠశాలను నడుపుతున్నారని విద్యాశాఖ అధికారులు స్పందించి జీనియస్ గ్లోబుల్ స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. రహంతుల్లా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోసిగి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుద్ది- కోల్‌మాన్‌పేట మధ్యలో ఉన్న ఎల్లెల్సీ కాలువ సమీపంలో ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువుల ఇంటికి వెళ్లి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. బైక్ అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రాథమిక వైద్యం కోసం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి తరలించారు.